# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 19-02-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో ప్రకృతి సేద్యానికి సహకారం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెగాసస్ సంస్థ ప్రతినిధులను కోరారు.

- ❖ పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి పూర్తి సహకారం అందిస్తామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.

- ❖ ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి అన్నారు.

- ❖ కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకొంటున్నామని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.

====================

పెగాసస్ క్యాపిటల్ అడ్వైజర్స్ ఛైర్మన్ క్రేయిగ్ కోగుట్, ఆపరేటింగ్ అడ్వైజర్ గినా మెకార్తీ, ప్రొడ్యూసర్స్ ట్రస్ట్ సీఈవో కీత్ అగోడా సచివాలయంలో ఈరోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిశారు. దావోస్ సమావేశానికి కొనసాగింపుగా జరిగిన ఈ భేటీలో... రానున్న రోజుల్లో కలిసి పనిచేసే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రాష్ట్రంలో ఉన్న అవకాశాలను, ప్రభుత్వ లక్ష్యాలను, ప్రస్తుత పరిస్థితులను ఆ సంస్థల ప్రతినిధులకు వివరించారు. ప్రజల ఆహార అలవాట్లు మారుతున్నాయని... ఆరోగ్యంపై శ్రద్ధ పెరుగుతోందని చెప్పారు. రానున్న రోజుల్లో ఆహార ఉత్పత్తుల సర్టిఫికేషన్ కీలకం కానుందని, ఆ దిశగా రైతులను, ఉత్పత్తి దారులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. రైతులను చైతన్య పరచి, ప్రకృతి సేద్యంలో అనుకున్న లక్ష్యాలను సాధిస్తామని, దీనికి సహకరించాలని ఆ సంస్థల ప్రతినిధులను ముఖ్యమంత్రి కోరారు.

====================

ఆంధ్రప్రదేశ్ లో పర్యాటక రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నామని ఆ శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఢిల్లీలోని యశోభూమిలో జరిగిన సౌత్ ఏషియా లీడింగ్ ట్రావెల్, టూరిజం ఎగ్జిబిషన్ -2025 (ఎస్ఏటీటీఈ) లో పెట్టుబడిదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించిందని, పరిశ్రమలకు ఇచ్చే రాయితీలన్నీ పర్యాటకరంగానికి కూడా వర్తిస్తాయని చెప్పారు. పర్యాటకాభివృద్ధి కోసం రాష్ట్రంలో నూతన టూరిజం పాలసీ 2024 - 29 తీసుకువచ్చామని వివరించారు. పబ్లిక్, ప్రైవేట్ పార్ట్ నర్ షిప్ (పీపీపీ) విధానం ద్వారా పర్యాటకాభివృద్ధి

చేయాలని యోచిస్తున్నామని, ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే వారికి పెద్ద ఎత్తున రాయితీలు, ప్రోత్సాహకాలను అందించి, ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని భరోసానిచ్చారు.

====================

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్.. దేశాన్ని 2047 సంవత్సరం నాటికి వికసిత్ భారత్ గా తీర్చిదిద్దేందుకు దోహదం చేస్తుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. తిరుపతిలో 2025 - 26 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ పై ఈరోజు జరిగిన మేధావుల సదస్సులో ఆయన పాల్గొని పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వివరాలను పూర్తిస్థాయిలో తెలుసుకుని ఆపై విమర్శలు చేయాలని మంత్రి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

(వాయిస్ 32 సెకన్లు)

====================

ప్రకాశం జిల్లా ఒంగోలులో నవోదయం 2.0 రాష్ట్రస్థాయి కార్యక్రమం ఈరోజు ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి పాల్గొని నవోదయం 2.0 కరపత్రాలను ఆవిష్కరించి, విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ... నాటు సారాతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని, కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని అన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, రాష్ట్రంలో నాటు సారాను నిర్మూలిస్తామని, త్వరలో మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ఈగల్ బృందాలను ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు.

====================

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో తిరుపతి మహిళా విశ్వవిద్యాలయంలో నూతనంగా నిర్మించిన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం విద్యా శాఖమంత్రి నారా లోకేష్ తో కలిసి ఆయన విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో క్రీడలను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నామని, అమరావతిని స్పోర్ట్స్ సిటీగా మారుస్తామని తెలిపారు.

విరామం

====================

కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకొంటున్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. తిరుపతి కార్మిక రాజ్య బీమా ఆసుపత్రిని ఈరోజు ఆయన ఆకస్మికంగా సందర్శించి, తనిఖీ చేశారు. అవుట్ పేషెంట్ బ్లాక్, అత్యవసర విభాగం, ఓ.పి. రిజిస్ట్రేషన్ విభాగం, ఇతర విభాగాలను పరిశీలించారు. అవుట్ పేషెంట్ల నమోదు సంఖ్య 350 వరకు పెరగడం, ఇన్ పేషెంట్ల అడ్మిషన్స్ సంఖ్య 53 వరకు పెరగడం పట్ల సంతృప్తి వ్యక్త పరిచారు. పేషెంట్ల కోసం 5 లక్షల రూపాయల సొంత ఖర్చుతో ల్యాబ్ కిట్స్, రీ ఏజెంట్స్, ఇతర పరికరాలను సమకూర్చిన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. శ్యాంబాబును అభినందించారు.

====================

రైతులకు మేలు చేయాలనే ఉద్దేశ్యంతోనే ఇంతవరకు మిర్చికి మద్దతు ధర ప్రకటించలేదని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈరోజు సచివాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... బహిరంగ మార్కెట్ లో మిర్చికి డిమాండు పెరుగుతున్న నేపథ్యంలో ఇప్పుడు కనీస మద్దతు ధర ప్రకటిస్తే రైతులు నష్టపోతారని

పేర్కొన్నారు. ప్రస్తుతం  చైనాలో మిర్చి పంట సరిగా లేకపోవడంతో ఆ దేశం మన మిర్చి పంటపై ఆధారపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, ఫలితంగా మిర్చి ధరలు భారీగా పెరిగే పరిస్థితులు నెలకొన్నాయని మంత్రి తెలిపారు. లాభదాయకతను దృష్టిలో పెట్టుకుని రైతులు కొంతమంది పత్తి, మొక్కజొన్న, కందులు తదితర ప్రత్యామ్నాయ పంటలు వైపు మారటం వల్ల  ఈ సంవత్సరం దాదాపు 2 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు తగ్గిందని తెలియజేస్తూ....

(వాయిస్ 23 సెకన్లు)

====================

రవాణా శాఖకు సంబంధించిన సేవలను ఇంటివద్ద నుండి ఆన్‌లైన్ విధానంలో పొందవచ్చని పార్వతీపురం మన్యం జిల్లా రవాణా శాఖాధికారి దుర్గా ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ... మధ్యవర్తిత్వం, అదనపు చెల్లింపులు వంటివి లేకుండా నేరుగా సేవలను పొందవచ్చన్నారు. డ్రైవింగ్ లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకొని, పరీక్షలకు నేరుగా హాజరై తమ లైసెన్సులను పొందవచ్చని, అలాగే డ్రైవింగ్ లైసెన్స్ పునరుద్ధరణకు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రవాణా శాఖలో పాత ఈ - ప్రగతి వెబ్‌సైట్ ను పూర్తిగా తొలగించారని, ప్రస్తుతం రవాణా శాఖకు సంబంధించి వాహన్ పరివాహన్ వెబ్‌సైట్, డ్రైవింగ్ లైసెన్సుల కోసం సారథి వెబ్‌సైట్ పని చేస్తున్నాయని ఆయన వివరించారు.

====================

జిల్లాలో ఉన్న అసంఘటిత కార్మికులను మార్చి నెల 31వ తేదీ లోగా "ఈ శ్రమ్ పోర్టల్"లో నమోదు చేయించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ అధికారులకు సూచించారు. అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ శ్రమ్ పోర్టల్ ను అందుబాటులోకి తీసుకుని వచ్చిందని తెలిపారు. వ్యవసాయ కార్మికులు, ఆశా వర్కర్లు, వలస కార్మికులు, వివిధ సంస్థల్లో, ఇళ్ళల్లో పనిచేస్తున్న కార్మికులు, చేతవృత్తుల పనివారు ఈ శ్రమ్ లో నమోదుకు అర్హులని పేర్కొన్నారు. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు, పూర్తి అంగవైకల్యం సంభవించిన వారికి 2 లక్షల రూపాయలు, పాక్షిక అంగ వైకల్యం పొందిన వారికి 1 లక్ష రూపాయలు బీమా సౌకర్యం దీని ద్వారా లభిస్తుందని వివరించారు.

====================

ఎన్.టి.ఆర్. కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను నాణ్యతలో రాజీపడకుండా వేగవంతంగా చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. అధికారులంతా సమన్వయంతో వ్యవహరించి వ్యక్తిగత లక్ష్యాలను నిర్ణీత గడువులోగా చేరుకోవాలని నిర్దేశించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఇసుక సరఫరా, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై ఆయన ఈరోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. లే అవుట్ల వారీగా సమీక్షించిన కలెక్టర్ ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

====================

వికసిత భారత్ సాధనే లక్ష్యంగా కేంద్రబడ్జెట్  రూపొందించారని... స్వాతంత్ర్యం అనంతరం అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందిన బడ్జెట్ గా ఇది నిలుస్తుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశాఖ ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు పెన్మత్స విష్ణు కుమార్ రాజు అన్నారు. శ్రీకాకుళంలో జరిగిన కేంద్రబడ్జెట్ పై మేధావుల సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... కేంద్ర బడ్జెట్ అన్నదాతలకు అండగా నిలుస్తోందని, ఈ బడ్జెట్ ద్వారా వ్యవసాయ రంగం అభివృద్ధికి బాటలు వేశారని అన్నారు.

====================
====================